పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గ్యాస్ గోడౌన్ ప్రారంభం


గ్యాస్ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆధునికీకరించిన హెచ్‌పీ గ్యాస్ గోడౌన్‌ను ఎస్పీ మలికాగర్గ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) శ్రీధరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ కె.రాఘవేంద్రరావు, డీపీవో ఏవో సులోచన, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్పీ

స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎస్పీ మలికాగర్గ్ ప్రారంభించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వో పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ఒంగోలు టౌన్: ఐఎన్‌టీఎస్‌వో లెవల్–2 పరీక్షల్లో స్థానిక భాగ్యనగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో తమ విద్యార్థులు ఒక ద్వితీయ బహుమతి, రెండు నాలుగో బహుమతులు, రెండు ఐదో బహుమతులు, నాలుగు ప్రత్యేక బహుమతులు, 40 ప్రోత్సాహక బహుమతులు, 207 బంగారు బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ తెలిపారు. విజేతలను ఆర్ఐ అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ శివ, ఉపాధ్యాయులు అభినందించారు.


విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, డీన్

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం


హైమాస్ట్ లైటింగ్ పోల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- 31వ డివిజన్‌లో హైమాస్ట్ లైటింగ్ పోల్ ప్రారంభం

ఒంగోలు: ఒంగోలు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక 31వ డివిజన్‌లోని కృష్ణుడి గుడి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటింగ్ పోల్‌ను బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. నగరాభివృద్ధిలో భాగంగా రూ.2 లక్షలతో లైటింగ్ పోల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నగరంలోని అనేక ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించిన బాలినేని

ఒంగోలు: స్థానిక శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. బాలినేని నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, సభ్యులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బాలినేని

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి

- మత్స్యకారులకు మోటారు సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సూచించారు. ప్రధానమంత్రి మత్స్యకార సంపద యోజన ద్వారా 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతనూతలపాడులోని ఐదుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.76,600 విలువ కలిగిన మోటార్ సైకిళ్లను ఎమ్మెల్యే టీజేఆర్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఐస్‌బాక్స్ కలిగిన ఈ మోటార్ సైకిళ్ల ద్వారా చేపలు విక్రయించడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఫిషరీస్ ఏడీ ఉషాకిరణ్, ఎఫ్‌డీవో ఆషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలు అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

లాయరుపేటలో నేడు సీతారాముల కల్యాణం

ఒంగోలు: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక లాయరుపేట సాయిబాబా ఆలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. శిద్దా రాఘవరావు దంపతులు, కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి స్వామి వారు, అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

31న మున్సిపల్ సర్వసభ్య సమావేశం

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ చల్లా అంకులు అధ్యక్షతన ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు నివేదికలతో హాజరుకావాలని కోరారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎం వరప్రసాద్, సిబ్బంది

మద్దిపాడు: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని అన్నంగి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వరప్రసాద్ సూచించారు. బుధవారం అన్నంగి సచివాలయం పరిధిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన దగ్గర నుంచే మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని, ఐదో నెల నుంచి బిడ్డకు, తనకు సరిపడేలా మరింత ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి అనూష, ఏఎన్‌ఎం ఉమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, అంగన్‌వాడీ వర్కర్లు అంజమ్మ, కరుణ, శ్రీదేవి, సంధ్య, కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పాతపాడుకు తాగునీటి పైపులైన్

ఒంగోలు రూరల్: మండలంలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పాతపాడు గ్రామానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రూ.36 లక్షల నిధులు కేటాయించారు. వాటితో ఉలిచి నుంచి పాతపాడు వరకు తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబు బుధవారం పైపులైన్ పనులను పరిశీలించారు. ఎక్కడా లీకేజీ లేకుండా డ్యామేజ్ జరగకుండా నిర్మాణాలు చేపట్టినట్లు ఎంపీపీ తెలిపారు. ఎమ్మెల్యే బాలినేని ఆదేశాల మేరకు వేగంగా పనులు పూర్తి చేస్తున్నట్లు డీఈ తెలిపారు. పైపులైన్ నిర్మాణంతో పాతపాడుకు తాగునీటి సమస్య తొలగుతుందన్నారు.